
# కృషి ఉంటే మనిషి ఋషియవుతాడు! నిరూపించిన దీవి రామాచార్యులు


## -సాంఖ్యాయన కర్మిష్ఠి ఆయనే డి. రాంబాబు!!-











**సర్వే**
**భవన్తు సుఖినొ**
**సర్వేసన్తు ని రామయా**
**సర్వే భద్రాణి పశ్యంతు మా కశ్చిదే దుఃఖభాగ**
**భవేత్॥**

సమస్త జనులు తరతమ భేదాలు లేకుండా సుఖంగా ఉండాలి. గంపెడు కోరికలు పెట్టుకుని తమకు సుఖం లేదని దుఃఖ భాగులవుతూండడం చూస్తూనే ఉంటాం. కానీ తాను నిరంతరం కృషి చేస్తూ, సర్వజన హితైషులయ్యేవారు అరుదు. అందుకే-

**శ్లో॥ ఉద్యమం, సాహసం, ధైర్యం, బుద్ధి, శక్తిః**
**షడేతే యత్రవర్తన్తే తత్రదేవః సహాయ కృత్॥**

సాధకునికుపక్రమించెడి సంకల్పం ఉండాలి. సాధన నిర్విఘ్నంగా ఉండాలి. అవరోధములకు వచ్చినను లెఖ్ఖ చేయకుండా ఆ సాధన, సాహసం, ధైర్యం, కృషి అదే శక్తి, బుద్ధి కుశలత, సమ భావం, సత్యగుణశీలం, నిరంతర కృషి కార్యోన్ముఖునిగా ఎవరివద్ద ఉంటుందో వారికి దైవ కృప సదా తోడుగా ఉంటుంది. గీత యొక్క సారం కూడా యిదే!

**ధనమును విద్యయు వంశం**
**బున దుర్మతునకు మదంబొనరించును స**
**జ్జనులైన వారి కడకువ**
**యును వినయము నివియు తెచ్చునుర్వీనాథా!!**

- అన్నారు. విజయాహెల్తు సెంటర్లో అత్యున్నతమైన జనరల్ మేనేజర్ పదవిలో ఉంటూ- ఆయన సంకలనం చేసిన 'సర్వదేవతా గాయత్రీ మంత్రావళి' పుస్తకం కావాలనీ, ఎప్పుడు రమ్మంటారని ఫోనులో కోరగా, మీరు పెద్దలు రావద్దు నేనే వచ్చి యిస్తాను. యని వినయంగా విధేయంగా చెప్పిన ఆ చిరంజీవి అణుకువను ఏమని చెప్పను. తత్గ్రంథములతోబాటు కొన్ని ఫలములుతో యింటికి వచ్చి, సత్సంగసంభాషణం జరిపి వెళ్ళిన చిరంజీవి దీవి రాంబాబును ఏ విధంగా ఆశీస్సులందచేయవలెనో ధర్మసందేహం నాకు కలిగింది.

రాంబాబు సామాన్యుడా- అసామాన్య ప్రతిభా సామర్థ్యములు కలవాడు. గాయత్రీ మంత్ర ద్రష్ట విశామిత్ర మహర్షికి 'బ్రహ్మర్షి' పదాన్నిచ్చి గౌరవించిన వశిష్ఠుడు- యిన్ని 356 దైవీక సంపద కలిగిన దేవతల గాయత్రీ మంత్రావళిని సమీకరించి, సరళీకృతంగా, సర్వజన శ్రేయోదాయ



దీవి రాంబాబు జనకులు కీ॥శే॥ శ్రీమాన్ విఖసాచార్యులు















కంగా తెలుగు ఇంగ్లీషు భాషల్లో అందజేశారు. వాటి విశిష్టతను విశ్లేషిస్తూ సంకలనం చేయడం సామాన్య విషయం కాదు. అసలీగాయత్రీ మంత్రముల ఉనికి యెక్కడున్నదో విషయసేకరణకై విస్తారంగా కృషి చేసి యజుర్వేదంలో నిక్షిప్తంగా ఉన్నాయని గ్రహించి, అందచేసిన రాంబాబును ఋషిసత్తముడనే యనాలి. ఆయనే చేసిన చేస్తున్న సనాతన ధర్మ అభివర్ధక కృషికీ– నిర్వహిస్తున్న నిత్యవత్తికీ సంబంధంలేదు. 2000 మంది పనిచేస్తున్న విజయా హెల్తు సెంటర్ పర్యవేక్షించడం అంత సులభం కాదు. ఎందరో విభిన్న శాఖల్లో పనిచేస్తున్నవారు విభిన్న మనస్తత్వములు కలవారు, రోగుల కోసం వచ్చేవారు, మరో సహాయం అర్థించి వచ్చేవారు, అటు యాజమాన్యం ఇటు వీరందర్నీ సమతుల్య భావంతో పర్యవేక్షించడం సులభమనుకోను. అలాటివారి మోము ఆనందమును చిలకరించడం అరుదు. అలాటి అరుదైన విషయాన్ని శ్రేయః కాముకులు మిత్రులైన కీ.శే. బి. నాగిరెడ్డి వద్ద చూసాను. నాగిరెడ్డిగారే స్వయంగా పరిశీలించి విజయాహెల్త్ సెంటర్లో ఉద్యోగం పొందిన డి. రాంబాబు వద్దనే చూసాను.

శ్రీనాగిరెడ్డి ఔన్నత్యమేఁవిటంటే రూ.500ల జీతంతో నియమించిన రాంబాబు వివాహం చేసుకున్నాడని తెలియడంతో నెలసరి జీతాన్ని రూ.15,00లకు పెంచారు అదీ ఆయన గొప్పతనం. ఆ అర్హతను సంపాదించుకోవడం రాంబాబు గొప్పతనం.

రాంబాబు గొప్పతనం పుట్టుక నుంచీ ఉన్నదనడానికి, కలియుగదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరుని పాదపీఠమైన తిరుపతిలో జన్మించడమో సుకృతం. అదియునుగాక తిరుమలలో తిరుమల తిరుపతి దేవస్థానం వారి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా మూడు దశాబ్దములపాటు పనిచేసిన శ్రీమాన్ దీవి విఖనసాచార్యులుగారి పుత్రునిగా జన్మించడం సుకృతములలోకెల్లా సుకృతం. ఇంకో మేల్ సుకృతమేమన శ్రీవేంకటేశ్వరస్వామి అర్చనా కార్యక్రమాలన్నీ శ్రీ విఖానస సాంప్రదాయనుసారం జరగడం. రాంబాబు వంశీకులందరూ శ్రీవేంకటేశ్వరస్వామి నిత్యపూజా అర్చకులుగా శ్రీవారి కొలువులో ఉండడం. ఇంతకన్నా అదృష్టమేముంటుందయ్యా రాంబాబూ!

తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర విద్యాలయంలోనే చదువుకుని పట్టానందుకుని, విద్యాదాహ తృప్తి లేకున్నందున హైదరాబాదు వెళ్ళి 3 సం॥లు చార్టర్డ్ అక్కౌంటెంట్‌గా శిక్షణ పొంది, మేనేజిమెంటు ఇండస్ట్రియల్ అడ్మినిస్ట్రేషను అధ్యయనం చేసి, పార్థసారథీ పీఠమైన చెన్నపట్నం చేరుకోవడం, తండ్రి విఖానసాచార్యులుగారి పరిచయస్తులైన శ్రీ బి. నాగిరెడ్డిగారి వద్ద ఉద్యోగానికి వచ్చి స్థిరపడడం శ్రీ తిరుమల శ్రీనివాసుని కృపే.

'కలౌ వేంకటనాయకా! అని వేంకటరమణున్ని పొగుడుతాం. ఆ వేంకటేశ్వరుని పాదపద్మాలను నిత్యమూ అర్చించే 'దీవి' కుటుంబీకుడు రాంబాబు సాహితీ కళలన్నిటిలోనూ అభిరుచీ కలిగి, అధ్యయనం చేసి అటు ఆర్ష్యధర్మ గ్రంథాలను సంకలనం చేయడం, ఇటు వైద్య సంబంధమైన మెడికల్ డిక్షనరీ 20,,000లు వైద్య (సాంకేతిక) పదములతో సంకలనం చేయడం, అబ్దుల్ కలామ్ వంటి గొప్ప శాస్త్రవేత్తల ప్రశంసలందడం, మదర్‌థెరిస్సా అవార్డు అందుకోవడంలో వేంకటేశ్వరుని కరుణ, నాగిరెడ్డి చలువా ఉన్నది. తన క్రింద పనిచేసే ఉద్యోగస్తులు తన కుటుంబ సభ్యుల్లా క్షేమంగా ఉండాలని కోరుకున్నవాడవడమే!

విజయా హెల్తుసెంటర్‌లో 'కాన్సర్ ఇన్‌స్టిట్యూట్ ప్రారంభానికి రాంబాబు కృషి చేసారు. రాంబాబు 53వ సం॥ములో హాస్పిటల్ మేనేజ్‌మెంట్‌పై నిశిత పరిశీలనం చేసి, అమెరికాలోని విశ్వవిద్యాలయానికి సమర్పించి అక్కడ నుండి 'డాక్టరేట్' పొందారు.

భగవంతుడెల్లెడలా ఉండి, నిను చూస్తున్నాడనే భయం ఉంటే, నీవు తప్పుడు పనులు చేయవు అనే సిద్ధాంతమును విశ్వసించిన 'రామ – బాబు' కాబట్టే 28 సంవత్సరాల ఉద్యోగంలో ఎన్నో మెట్లునధిరోహించ కలిగాడు. ఎదిగే కొద్దీ ఒదిగే స్వభావం కలవాడు. చెట్టు కాయలూ, ఫలాలు కాసినపుడు వంగి ఉంటుంది. మనిషి ఎదిగే కొద్దీ వినయాన్ని కూడా పెంచుకోవాలి. అందుకే బ్రహ్మకు కూడా అతిశయం పెరిగినప్పుడు 'రిమ్మ' తిరిగిందంటారు 'రామ–బాబు' కలాటి లక్షణాలు లేవని ఆనాడు వచ్చిననాడే గ్రహించాను. ఇమ్మంచి మనిషిని "సంజీవ శరదశ్శతమ్" అని ఆశీర్వదిస్తున్నాం. ●

# వెయ్యేండ్లకైనా ఇలాటి వాడొక్కడు పుట్టడు!!
# డా॥ గరికపాటి రాజారావు

ప్రజా నాట్యమండలి నుంచీ సినిమా రంగానికి వచ్చినవారిలో డా॥ గరికపాటి రాజారావు చాలా గొప్ప వ్యక్తి. ఆయన కమ్యూనిస్టు అయినా ఏ యిష్టుయైనా 'మనిషి'గా గొప్ప వ్యక్తి. అలాటి వ్యక్తి వెయ్యేండ్లకైనా ఒక్కడంటే ఒక్కడు పుడతాడనుకోను!

**ఏమను కోనూ! నిన్నేమనుకోనూ! నిన్ను రుసరుసలాడినవన్నీ నీతో తీసుకొని వెళ్ళావనుకోను. ఒక్క ఫోటోనైనా, నీతో తీసుకోలేదని కుమిలిపోను! నిన్నెందరు మరిచారో కానీ, నేను మాత్రం 'హృది'లో పదిలపరచుకున్నాను.** ఆనాడు నీ పట్ల మాట్లాడిన కఠిన మాటలను మాత్రం విడిచిపెట్టేసాను. డా॥ రాజారావుగారూ! నా కుమారుని వైద్యం కోసం– మిమ్ము! డాక్టరుగానే ఉండు! ఏక్టరుగానైనా ఉండు. నాటకాల డైరెక్టరుగానైనా ఉండు– అని కఠినంగా మాట్లాడితే పట్టించుకోక వచ్చి నా కుమారుణ్ణి, నా సతినీ టాక్సీలో తీసుకుని వెళ్ళి వ్యాధి నయం చేసి అప్పగించారు. మన రాష్ట్రపతి మన తెలుగువాడు డా॥ సర్వేపల్లి రాధాకృష్ణయ్య సమక్షంలో 'జై భారత్' నాటకానికి రిహార్సల్సు వేస్తున్న సమయమది. నాకోపానికి మీరు చిరునవ్వు సమాధానమిచ్చారు. తదుపరి నేను టైఫాయిడ్ జ్వరంతో ఇంట్లో ఒంటరిగా బాధపడ్తున్నపుడు, మీరు వచ్చి వైద్యం చేయవచ్చిన సందర్భంలో నేను ఇంజెక్షన్ చేయించుకోను. 3 రోజుల్లో తగ్గించాలి. నాలుగోరోజున ఆవకాయతో అన్నం తినాలి. నేను నడిపే మధురవాణి. మధురిమ, బాలరాజ్యం పత్రికలు మూడు పోస్టు కావాలని కోరాను. ఏంవి బండ కోరిక యిది. సముద్రాలవారు 'బాలసన్యాసమ్మ ఎవరితోను సంగమించరాదు. పతివ్రతవు కారాదు! సంవత్సరములో పండంటి బిడ్డను చూపాలి' అన్నట్లు జానపదా కథా చిత్రంలా ఉంది కదూ!



ఎంత విశాలమైన కళ్ళు! దీర్ఘాలోచనగల మోము ఎవరిది- రాజారావు ఒక్కరిదే!

మీరు 'అమరు'లయ్యారు! మీకు గుర్తుందో లేదోగానీ 55 సంవత్సరాలు దాటినా నాకు గుర్తున్నది రాజారావు గారే!

ఎంత నిర్మల మనసు! ఎవరికుంటుందీ మనసు ఎందరెందరో నాటక/ నటీనటులకు మీ 'పుట్టిల్లు' చిత్రమే చిత్రరంగపు పుట్టిల్లు చేసిందని ఎందరు గుర్తింపు పెట్టుకున్నారు? 'పుట్టిల్లు' చిత్రంతోనే మీరు చలనచిత్రరంగం ప్రవేశించారు. ఎవరు చేయగలరీ సాహసం? వారు 'నటులు'



డా॥ రాజారావు పుట్టిల్లూ, జమున పుట్టిల్లూ 'పుట్టిల్లు' చిత్రమే

కాబట్టి నెగ్గుకు రాగలిగారు తారాపథం చేరారు.– కానీ మీరు మా హృదయాల్లోనే గూడు కట్టుకుని ఉన్నారే తక్క, సినిమారంగంలో ఇతరులంతగా పట్టించుకోలేదు. మీరు పుట్టిల్లుగా భావించి పాదం మోపిన 'పుట్టిల్లు' చిత్రం తక్క యే చిత్రములోనూ, మీ ప్రతిభకు తగ్గపాత్రలనిచ్చిన దాఖలా నాకంటికి కనిపించలేదు. మీరు పరిచయం చేసిన వారందరికీ దోహదమైన 'పుట్టిల్లు' మీకు తీరని ద్రోహం చేసింది. అయినా వేచి వేచి చూచి, వెగవక మీ నాటక రంగాన్ని తల్లి చేసుకున్నారు.

ప్రజావైద్యునిగా, ప్రజానాట్యమండలిని ధృవతారగా నిలబెట్టి, రెండు దశాబ్దములు అసమాన సేవ చేసారు. సుంకర, వాసిరెడ్డి రచించిన 'మా భూమి' 'ముందడుగు' నాటకాలకు చక్కని రూపకల్పన చేసి వందలాది ప్రదర్శనలకు కారణభూతులయ్యారు. 'కళ కళకోసమూ కాదు. కాసులకోసమూ కాదు. ప్రజల కోసమ'ని జీవితాన్ని ధారవోసారు. ప్రజలవద్ద కాసులాశించకుండా వైద్యం చేసి, డబ్బు నాశించకుండా నాటకాలు ప్రదర్శించి, సినిమాను నిర్మించి, చేతికి 'చిల్లుకానీ' దక్కకపోయినా, దేహీయని ఒకరి వద్ద చేయిపెట్టక హారతి కర్పూరమై, ఒరుల జీవితానికి వెలుగులు చూపించి, చీకటి తెరలోనే జీవితం ముగించుకున్న మీకూ జగమూ, జనమూ ఏం వీ చేసింది, మీరేంవి ఆశించారు.

1952 –53 సంవత్సరములో సినిమారంగానికి వచ్చిన మీరు దశాబ్దం కాలం యిక్కడెలా ఉన్నారు. సినిమారంగం మీ సామర్థ్యం నెరిగి ఉండీ, నెఱుంగ కున్నా మీరు బాధపడలేదు. 1915 సం॥ ఫిబ్రవరి 5న రాజమహేంద్రవరంలో జన్మించిన మిమ్ములను గోదా వరీమ తల్లి ఉవ్వెత్తు కెరటాలతో నాటకరంగం మిమ్ము గ్రుతలూగించింది. క్షీరసాగర తియ్యదనాలతో జీవింప చేసింది. కానీ మద్రాసు సినిమా రంగం క్షార సముద్రతీరంలో ఉండడం వల్లనోయేమో ఉప్పదనాన్నే రుచిచూపి, 1963 సం॥ సెప్టెంబర్ 8వ తేదీన, 50 యేళ్ల వయసునైనా చూడనీకుండా 49వ సంవత్సరం లోనే తీసుకుని పోయింది.

ఎందరెందరో నటులు సినిమారంగానికి వచ్చి తారలై, సితారలైననూ, ఒక్క 'జమున' మాత్రమే. యెక్కడో 'మురళీకృష్ణ' చిత్ర నిర్మాణ సందర్భంగా అవుట్‌డోర్ షూటింగ్‌లో ఉండి హఠాత్తుగా తన కాల్‌షీటు కాన్సిలు చేసుకుని మద్రాసు వచ్చి రాజారావు అంత్యక్రియలను జరిపించి, ఆ కుటుంబానికి స్థిరాస్తి కొనిపెట్టినట్లు గుర్తు. ఆంధ్రాక్లబ్‌లో మాత్రం పదుగురు సంతాపసభ జరిపారు. ఆ సభలోనున్న సీ.యస్సార్ గారితో నేను మాట్లాడుతూ "ఏంవిటి మావగారూ! సుహృదయుడైన డా॥ రాజా రావుగారిలా పోయారు– అని చెమ్మగిల్లిన కళ్ళతో అడిగితే "అల్లుడూ! హృదయమున్నవారిలాగే హృద్రోగంతో పోతారు' అంటూ, 'నేనూ, నువ్వు జాగ్రత్తగా ఉండాలి' అన్నారు. 'ఈ అసుర సంధ్యలో మీరిలా అనకండి' అన్నాను. ఏ తథాస్తు దేవతలు విన్నారో ఏమోగాని ఆ తరువాతి వారమో, ఆ మరుసటి వారమో సీయస్సార్‌గారు పోయారు.

**పోయినవోళ్ళందరూ మంచోళ్ళే! ఉన్నవారు పోయినోళ్ల తీపి గురుతులూ** యని స్మరణం చేసుకున్న 'జమున' హైదరాబాదులో జరిగిన తన నట జీవిత రజతోత్సవ సమయమున 'రాజారావు' చిత్రం పెట్టి పుష్పమాల వేసి, నీరాజనం పడితేగానీ, ఆమె సభను ప్రారంభించలేదు. అంతటి **బంగారుమనసుగల తల్లి జమున.**

రాజారావుగారు అలానే తాను పుట్టిల్లు ద్వారా నష్టపోయినందుకు బాధపడలేదు కానీ జమున తారాపథం చేరుకున్నందుకు సంతోషించారు. అలాంటి మంచి వారెక్కడైనా ఉన్నారా? కంచుకాగడా పెట్టి వెదికినా దొరకరు. రాజారావుగారు రెండో చిత్ర నిర్మాణం చేయాలని ప్రయత్నించారు. జగయ్యగారుచితంగా నటిస్తానని ఉత్సాహపరిచారు. ఆయన ప్రయత్నాలు ఫలించలేదు.

జమున, చలం అల్లు రామలింగయ్య, మిక్కిలినేని చదలవాడ కుటుంబరావు, పెరుమాళ్ళు– ఇలా వేళ్ళకూ, వేళ్ళమధ్య కలానికి అందడం లేదు. రాజారావుగారి గొప్పతనం ఏమంటే – ఆయన దర్శకునిగా ప్రదర్శించిన నాటకంలో– ఓ సేపకుని పాత్ర ధరించడానికి ఎవరూ రాకపోతే సంభాషణం లేని పాత్రను తానే నటించి గొప్పనటునిగా ప్రేక్షకుల కరతాళ ధ్వనులందుకున్నారు. 'మాభూమి' నాటకం వందలాది ప్రదర్శనలకు టిక్కట్లు దొరకకుండా ప్రదర్శింపబడిందంటే ఆ నాటక రచయితలకు నటీనటుల వెలుగుదనానికి రాజారావే కారకులు. హిట్లర్ యుద్ధో న్మాదాన్ని ప్రదర్శించే ఓ ప్రదర్శన కోసం కూచిపూడినృత్యం అభ్యసించారు. సంపత్ కుమార్ అనే నటుడు 'జాలరి' నృత్యం చేయడానికి శిక్షణ యిచ్చారు. ధ్వనిసామ్రాట్ నేరెళ్ళ మాధవ్ మిమిక్రీకి ఇలా ఎందరో జాతీయ అవార్డులు అఖిల భారత ప్రఖ్యాతి నొందుకోవడానికి కారకులై, తానుమాత్రం తెరవెనుక ఉండిపోయారు. ●

# వేదవిజ్ఞాన ఖ(గ)ని కుప్పా వేంకటకృష్ణమూర్తికి సత్కారం! ఓ సత్కార్యం!



శ్రీ కుప్పా వేంకట కృష్ణమూర్తి గార్ని గురించి, నేను ఒప్పుగా చెప్పగలను గానీ, గొప్పగా చెప్పగల నేర్పు నా వద్ద లేదు. వారిని మొదట చూచింది మైసూరుదత్త అవధూత పీఠంలో! కలిసి కూర్చుని అయిదు, పదినిముషాలు. మాట్లాడింది అయిదు అర నిమిషాలు. అయితే దమయంతి నలమహారాజుని రెండవసారి స్వయంవరంలో వీక్షించి, అతని హృదయకుహరంలో ఏదో విప్పారిన కమలమున్నదని గ్రహించినట్లు ఆయనలో అనిర్వచనీయమైన వేదసారపఠనం, మెరుపుతీగలవంటి 108 ఉప నిషత్సారం నిలవలో ఉన్నప్పటికినీ–నిలువెత్తు పరిశోధనకు భవిష్యత్ప్రణాళికను తన మేల్బంగారపు కోశాగారంలో నిజాము నవాబులా భద్రపరచుకుని ఉన్నారని నా అంతరాత్మ చెప్పకనే చెప్పింది.

ఒక్కొక్కప్పుడు నా మనసు నాడీ జ్యోతిష్యం చెప్పినట్లు మనః ప్రకంపనలు వస్తుంటాయ్ అని ఆ మధుర వాగ్వాణి వాణీమాత అధరాల్నుంచీ జాలువారే జల్తారు పలుకులేగాని నావిగావు. వాటినందు నా నేర్పులేదని తెలుసు.

నా మిత్రులు కె.పి. చంద్రరావు కుటుంబ బృందంతో మైసూరు దత్త అవధూత దత్తపీఠంలో జరిగిన శ్రీశ్రీశ్రీ గణపతి సచ్చిదానంద స్వామివారి జన్మదినోత్సవంలో పాల్గొన్న 2, 3 రోజుల కార్యక్రమాల్లో జరిగిన కుప్పావారితోని సత్సంగం. అప్పటి వరకు **'భక్తిమాల'** సంపాదకులు, నేను **సినీరమ** సంపాదకుణ్ణి. రెండూ నాలుగేనాలుగు అక్షర సంపుటిగల పత్రికలే అయినప్పటికినీ ఇరువురికీ 18 అక్షోహిణిల సైనిక సంఖ్యాబలం ఉన్న ఛాయామాత్ర సంకల్పమే తక్క, నేనూ వారూ ఓ దశాబ్దకాలం పాటు ఛాయామాత్రంగానైనా ఒకరినొకరు చూచుకోలేదు. నేను మరల దత్త పీఠం సందర్శించలేదు.

వారు నాభాగ్యంగా భాగ్యనగరం వచ్చినతరువాత I.SERVE అనే వేద పరిశోధనా సంస్థను స్థాపించడం, నా సంపాదకత్వమున వెలువడుతున్న 'ప్రముఖాంధ్ర' వశిష్ఠుల వంటీవారి నెందుకాకర్షించిదో, ఒకవేళ **ప్రముఖాంధ్ర** సత్యహింసాత్మక, స్వార్థ ప్రగాఢ శ్రాద్ధ రాజకీయ జాలంలో స్వకుచమర్దనంగా మాతృభాషనే మరచిన సందర్భాన్ని పురస్కరించుకుని దేశమహోన్నత సాహిత్య, సాంస్కృతిక, సాంప్రదాయ వేదుపనిషత్సా రాన్ని సమ్మిళతం చేసి, చిరకీర్తినార్జించిన రామాయణ, మహాభారత, భాగవత గ్రంథసారాన్ని సమ్మిళతంచేసి, మహోన్నత శీతలహిమ శిఖరాలను శిరః భాగమునను, ఇరు భుజకీర్తలందు, పాదయుగళములందు అంతు తెలీనీ అనంత సాగారాలను పర్యవేష్టించుకున్న భారతదేశం నుంచి మహోన్నత వేద సాంప్రదాయ సంపద పశ్చిమ దేశాలకు పోయిందేగానీ, మన దేశంలోని అక్షఞాలు నేర్చిన వారెట్టి కోశా గారములందు భద్రపరచుకోలేదన్న కిం్తచిత్చింతనను పడ్తున్న **ప్రముఖాంధ్ర** వారి చక్షువులు గ్రహించడమో, నా పురాకృతమో, జ్ఞాన అమ్మహా అగస్త్యుణ్ణి ఆకర్షించిందేమో! వారి దృష్టిని పడ్డాను. వారి కార్యక్రమాలకు నన్ను పిలిపించడం, పొత్తిళ్ళలోని బిడ్డగా తిరిగి పంపించటం జరిగింది. సంక్రాంతి, ఉగాది పండుగలు యెప్పుడు వస్తాయన్న వారి పిలుపుల నెదరుచూచేవాణ్ణి అంటే విశ్వసించండి!

ఇంతటి ఉపోద్ఘాతం చెప్పిననూ, ఆ అపార వేదవిజ్ఞాన పరిశోధకుడూ, అగస్త్యుని వంటి ప్రజ్ఞానిధీ, వశిష్ఠుని వంటి శాన్త స్వరూపుడూ అయిన బ్రహ్మశ్రీ కుప్పా వేంకటకృష్ణమూర్తిగారికి భాగ్యనగరంలో సత్కారం జరిగిందని వినిన ఈ వీనులు పరవశించి, హసించి, నా హృదయానికీ, పిదప కరానికీ, అక్కణ్ణుంచీ కలానికి బట్వాడా చేశాయి.

## పేరులోనే అనిర్వచనీయమైన ప్రతిభ ఉన్నది!

వేద పరిజ్ఞాన పరిరక్షణ వ్యాప్తికి దశాబ్దాలుగా విశేషంగా కృషి చేస్తున్న కుప్పా వేంకట కృష్ణమూర్తి గణితశాస్త్రంలో మాస్టర్ డిగ్రీ చేసి బ్యాంకు ఉద్యోగం చేరినప్పటి కినీ ఆయన మనస్సు అందులో నిలువలేదు. వారి జనకులు శ్రీ జనార్ధనానన్ద సరస్వతీస్వామి వారిగా ఎంతో ప్రసిద్ధి చెందారు. వారి వారసత్వంగా లభించిన వేద విద్వత్తు సంపదను ఆధునిక విద్య, ఉపాధి మార్గం నుంచి వేదాల వైపు నడిపించింది. ఫలితంగా ఆయన 37వ ఏటనే బ్యాంకు ఉద్యోగం నుంచి స్వచ్ఛంద పదవీ విరమణ చేసి, వేద పరిరక్షణ, వేద విజ్ఞానవ్యాప్తికి నిరంతరం కృషి చేస్తున్నారు. తెలుగు, ఆంగ్ల, సంస్కృత భాషల్లో పట్టునుపయోగించుకుని వేదవిజ్ఞానాన్ని సామాన్యులకు అర్థం అయ్యే రీతిలో అందించే సామర్థ్యమును కరతలామలకం చేసుకున్నారు.

అటు ఆధునిక విజ్ఞానమును, విజ్ఞానానాల మేలుకలయికగా ఉండే కృష్ణమూర్తి అవధూత దత్తపీఠంలో విద్యాధికారిగా, ట్రస్టీగా పనిచేశారు. 'భక్తిమాల' సంపాదకులుగా ఉంటున్నారు. శ్రీదత్తదర్శనం చిత్రానికి సంభాషణలు వ్రాశారు. ఆ తరువాత వేదాలపై శాస్త్రీయ పరిశోధన సంస్థ (ఐ సర్వ్)ను స్థాపించి వేదవిజ్ఞాన వికాసానికి విశేషంగా కృషి చేస్తున్నారు. ఇప్పటీవరకు 36 జాతీయ సమ్మేళనాలు, 30కిపైగా ఆధ్యాత్మిక, వైజ్ఞానిక గ్రంథాలు ప్రచురించారు. 11 ఆధునిక వైజ్ఞానిక సంస్థలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నారు. ఆయుర్వేదం, పాణినీ వ్యాకరణంలను నూతన కంప్యూటర్ లాజిక్ ఆవిష్కరణ, నవీన వైజ్ఞానిక రీతులలో పురాతన సంఘటనల కాలనిర్ణయం, సనాతన భారతీయ గణితం, భారతీయ ఖగోళ శాస్త్ర వైదిక పద్ధతుల్లో పరిష్కారం చేసారు. భూకంపాది ఉత్పాతాల నిర్ణయం, ఆధర్వణ వేద పరిశీలన వంటి పరిశోధన ప్రాజెక్టులను అవిశ్రాంతంగా నిర్వహిస్తున్నారు. ఆంధ్ర, ఆంగ్ల, సంస్కృత భాషల్లో ఆయన పరిశ్రమ జరిపారు. యోగవాశిష్ట హృదయంనాలుగు సంపుటాల తెలుగు వచనం (ఆంగ్లంలో కూడా రచించారు.) గురుతత్వ గురు సచ్చిదానంద సద్గురు చరిత్ర, అధ్యాయ శ్లోకావళి, యోగతారావళి, రుద్ర ప్రపంచ సత్వం ఆయన రచించిన గ్రంథాలలో మచ్చుకు కొన్ని ఉదహరించాం. వేదగణితంపై పుస్తకాలు రచించడంతో పాటు అనేక పరిశోధన వ్యాసాలు సమర్పించారు. వేద పరిరక్షణతోపాటు ఆధ్యాత్మిక రంగానికి చేస్తున్న సేవలకుగాను 2002లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆయనను ఉగాది పురస్కారంతో సత్కరించింది. జ్ఞానసరస్వతి పురస్కారం, కళ్యాణ భారతి ప్రతిభా పురస్కారం, మహర్షి విజ్ఞాన పీఠం వారి జ్ఞాన కులపతి పురస్కారం, డాక్టర్ పైడి లక్ష్మయ్య ప్రతిభా పురస్కారం, తెలుగు విశ్వవిద్యాలయం నుండి ధర్మనిధి పురస్కారంతోపాటు ఎన్నోపురస్కారాలు, సత్కారాలు ఆయనను వరించాయి. కుప్పా వేంకట కృష్ణమూర్తి గురుదేవుల ఆదేశం మేరకు ఐసర్వ్ సంస్థను ఏర్పాటు చేసి వేదాల్లో ఉన్న అనంతమైన విజ్ఞానాన్ని ముందు తరాలకు అందించేందుకు వీరు చేస్తున్న అనన్య కృషి అన్ని వర్గాలనుంచి అభినందనలు అందుకుంటోంది.


## సత్కార్య సభ

తెలుగు విశ్వవిద్యాలయం కళామందిరంలో అభినంద సభ నిర్వహించి మెదక్ జిల్లా జగదేవ్‌పూర్ శ్రీసీతారామ వేద సంస్కృత విద్యాపీఠం తన గొప్పదనాన్ని చాటుకుంది. అభినందన సభలో వివేక చూడామణి, చతుస్సూత్రీ తాత్పర్య దీపిక, శ్రీమత్ భాగవత రహస్యము ఈశావాస్యోపనిషత్తు శ్రీమద్ భగవద్గీత 1–6 అధ్యాయాల ఆంగ్ల తరగతుల ఆడియో సిడి ఆవిష్కరణలు కూడా జరిగాయి. ఈ విషయం తెలిసి మా ఆనందకందిత హృదయ మందార అభినందనలు తెలియ జేస్తున్నాము.

చెన్నై తెలుగు వెలుగులు :

# సంగీత సాహిత్య వారధి - పప్పు వేణుగోపాలరావు పయోధి!

**-బొబ్బిలి నుంచీ వచ్చిన ఈయన షోడశ కళా విద్యల బెబ్బులి -**



ఏదైనా తాను అధ్యయనం చేసి, అనుభవంలో తెచ్చుకుంటేనేగాని చెప్పరు.

మన తెలుగులోని ప్రతిభకల వారందర్నీ ఇంగ్లీషున చెప్పి వారిని విశ్వవ్యాప్తం చేయాలంటారు.

పొరుపొచ్చాలు లేకుండా, అవతలి వాడికి పేరొస్తుందని కుంచుకుపోకుండా ప్రోత్సహిస్తే అవనీపతియైన పరంధాముడు మెచ్చుకుంటాడు. ఇది నా స్వానుభవం! బొబ్బిలిలో పుట్టి, విద్యలనగరం విజయనగరంలో విద్యలు వడని, కళాసాహిత్యాల కాణాచియైన చెన్నపట్టణం చేరుకున్నదీ కణుపులేని చెరకు. వాయులీనం విద్వాంసుని నుంచీ, సంగీత రాగరాజు మంగళంపల్లి బాలమురళీకృష్ణ వరకూ ఆయన సమావేశం కాని సంగీత బ్రహ్మలెవరూ లేరు. నేను మంగళంపల్లి బాలమురళీకృష్ణ శిష్యుడని సగర్వంగా చెప్పుకుంటారు. అదీ ఆయన నిరాడంబర (సం) సంబరం.

ఆయన సరాసరి చెన్నయ్ రాలేదు. ఆయన వయా బళ్ళారి మీదుగా చెన్నయ్ చేరారు. ఆంధ్ర, ఆంగ్ల, సంస్కృత భాషల సంగమంలో ఉడికిన 'పప్పు' నృత్య, గాన, సాహిత్యంలో పండిన బుర్ర మెప్పు–వెరశి **పప్పు వేణుగోపాలరావు.** మద్రాసు వచ్చీ రాగానే అమెరికన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ స్టడీస్, విస్కాన్సిన్ యూనివర్శిటీల మద్రాసు ప్రాంతీయ కార్యాలయం రీజినల్ ఆఫీసర్‌గా 1980లో ప్రవేశించారు. 2010 వరకూ అందులోనే మునిగి అసోసియేట్ డైరెక్టరుగా పదవీ విరమణం చేసారు, గానీ సంగీత, సాహిత్య, నృత్య కళల్నుంచీ పదవీ వి రమణం చేయనంటారు.

హిందూ ఆంగ్లపత్రికలో గ్రంథ విశ్లేషణా లేఖరిగా ఉంటూ, చాలామంది తెలుగు రచయిత గ్రంథాల సమీక్షను వ్రాసి తెలుగేతర ప్రపంచానికి తెలియచేసారు. అందులో నేను ఆంధ్రీకరించిన 'అధ్యాత్మ రామాయణం' గ్రంథం ఉండడం నా అదృష్టం. బియస్సార్ కృష్ణగారు బ్రతికి ఉండగా ఆయన తెలుగువారి గ్రంథాల సమీక్షలను 'హిందూ'లో వ్రాస్తూ – గోటేటి శ్రీరామారావుగారూ! మీరు వ్రాసిన గ్రంథాలు 'హిందూ'లో సమీక్షించి ఋణం తీసుకుంటాననేవారు. ఆయనా, ఎన్నార్ చందూర్, మీరూ – అంటే మనం ముగ్గురమే మద్రాసు 'తెలుగు పత్రికా రచయితత్రయం' అని సంబరపడేవారు. కృష్ణగారి అనుంగుమిత్రులే ఈ పప్పువేణుగోపాలరావు వరేణ్యుడు. వైశ్యప్రముఖులందరికీ తలలోని నాలుక వంటి వ్యక్తి. ఆయన తెలుగు వాగ్గేయ కారులందరిపైనా చక్కని విశ్లేషణ చేసారు. అన్నమాచార్యకృతులపై ఆంగ్లంలో అతి చక్కని విశ్లేషణా గ్రంథాన్ని రచించి ప్రచురించారు. పి.వి. రమణయ్యరాజా ముఖ్య సలహాదారుల్లో ఒకరు. ఆయన ప్రోద్బలంతో ఆదిశంకర భగవత్పాదుల 'భజ గోవిందం' గ్రంథానికి ఆంగ్ల వ్యాఖ్య వ్రాసారు. ఏడుకొండలవాడి ఏడువారాల అర్చనలూ, అభిషేకాలపై డి.వి.డి. దృశ్యశ్రవణమాలిక తయారు చేసారు. 'సంగీత సాంప్రదాయని' 'రసమంజరి' వంటి గ్రంథాలను ఆంగ్లంలోకి తర్జుమా చేసారు. ఆయనకు తెలుగు సంస్కృతగ్రంథాలను ఆంగ్లంలోకి తర్జుమా చేయడం కరతలామలకం.

ఆంధ్ర ప్రాంతంనుంచీ మద్రాసు వచ్చిన తెలుగు ప్రముఖులెందరో భాషారాష్ట్రంగా ఆంధ్రరాష్ట్రం విడివడిన తరువాత, చాలామంది తెలుగువారు స్వరాష్ట్రానికి తరలివెళ్ళిపోయినా పప్పువేణుగోపాలరావు వంటి ప్రముఖులు మద్రాసును వీడిపోలేదు. ఇప్పవిత్ర స్థలాన్ని జన్మభూమిగా తలంచి యిక్కడే ఉండిపోయారు.

అందుకు మురిసిపోయిన చెన్నయ్ తల్లి వీరిని మద్రాసులోని మ్యూజిక్ అకాడమీ ప్రధాన కార్యదర్శిగా తన ఒడిలోకి తీసుకున్నది. ఆయన వచ్చిన తరువాత అకాడమీలో జరిగిన సంగీత కచేరీల నుంచి మూడువేల గంటల సంగీతాన్ని సేకరించి 'ఒకనిధి'గా చేసారు. మద్రాసు మ్యూజిక్ అకాడమీ నిలిపివేసిన పుస్తకప్రచురణను పునరుద్ధ రించారు. అకాడమీకి అనుబంధంగా సంగీత పాఠశాలను నడుపుతున్నారు. ఇక్కడ మూడేళ్ళ సంగీత డిప్లొమా బోధనను ఉచితంగా చేస్తారు. తిరువాయూర్ వోలె త్యాగరాజస్వామి సంగీత స్మారకోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. పప్పు వేణుగోపాలరావు అష్టావధానాలు కూడా చేసారు.

వీరి సతీమణి జయా వేణుగోపాలరావు విద్యాబోధనా రంగంలో అందెవేసిన హస్తం. పాఠ్యప్రణాళిక (సిలబస్)ను కూడా క్రమబద్ధీకరించారు. ఎందరో విద్యార్థీ విద్యార్థినులకు విద్యగరిపారు. చెన్నయ్‌లోని ఆంధ్రమహిళా సభ అధ్యక్షురాలిగా ఆమె వ్యవహరించారు. ఈ దంపతులకు ప్రముఖాంధ్ర శుభాశీశ్శతములు! ●

**(కొవ్వలి నరసింహారావు వెయ్యి నవలలు వ్రాసారని తుమ్మలపల్లి రామలింగేశ్వర రావుగారు ఆంగ్లంలోని 'Hindu' వ్యాసం వ్రాసి, ఆయన్ను బయట ప్రపంచానికి చెప్పడమే గాకుండా, శృంగేరిపీఠాధిపతుల నుంచి, బంగారు జరీ, కాశ్మీర్ శాలువ తెప్పించి 'కొవ్వలి'కి వేదపండితులచే ఆశీర్వచనంతో కప్పారు. ఆనందకందితుడైన 'కొవ్వలి' నా వద్దకు వచ్చి ముచ్చటిస్తూ ఆనందాబ్ధిలో మునిగి పోయారు. వేయి నవలల రచన కన్నా ఆ శాలువ మిన్నయింది.)**

ధర రూ. 200/- మాత్రమే

## ఫెంగ్‌షూయ్ అదృష్ట నాణాలు

Fengshui Lucky Coins



ఫెంగ్‌షూయ్ అదృష్ట నాణం సాధారణ నాణం వలె గుండ్రంగా వలయాకారంలో ఉండి మధ్యలో రంధ్రంతో ఉంటుంది. మధ్య రంధ్రం భూశక్తిని, నాణం యొక్క వలయం స్వర్గశక్తిని సూచిస్తుండగా ఆ నాణానికి కట్టబడియున్న ఎర్రరిబ్బన్ మానవశక్తిని సూచిస్తుంది. అంటే మానవ, స్వర్గ మరియు భూ శక్తులను ఐక్యం చేసి ఆ రెండు ప్రాంతాలందుగల సంపదను ఆకర్షించే అయస్కాంతంగా పనిచేస్తుంది ఫెంగ్‌షూయ్ అదృష్ట నాణాలు. ఈ నాణాలను బిల్‌బుక్, ఆర్డర్ బుక్, బ్యాంక్ పాస్‌బుక్, లాకర్, బీర్వా, గల్లాపెట్టె, కంప్యూటర్, బ్రీఫ్‌కేస్ మొదలైనవాటిల్లో ఉంచితే ఇక ఆ పెట్టిన చోట మనీ రొటేషన్ బాగుంటుంది అంటే ధనానికి కొరతే ఉండదు. మనీపర్సు, సూట్‌కేస్‌లో పెట్టుకుని మీతోపాటు నిరంతరం ఉంచుకుంటే ఎల్లవేళలా విజయం మీదే!

✍ ముల్లంపల్లి రామలింగ శాస్త్రి

భక్తిటుడే పవిత్ర సామాగ్రి పరిశోధన నిలయం

Bakthitoday Pavithra Saamagri Parisodhana Nilayam

Balabharathi Nilayam, 49/214, Rangarajapuram Main Road, Kodambakkam, Chennai - 600024

Ph. : 044-24837505, 09840259871

Visit : www.bakthitoday.blogspot.com • www.indiamart.com/bakthitoday-pavithra

# ఘంటసాల మామూలు మనిషి!

## మేము నమ్మము అంటున్నారు : గోటేటి



చిన్మంద హాసుడు ఘంటసాల

ఘంటసాల 40వ వర్ధంతి మహాసభలు దేశమంతటా ఘనంగా సాగాయ్. మీరు ఎచ్చోట పెళ్లికీ, చావుకీ వెళ్ళినా, దేవుడి క్షేత్రాలలోనూ ఘంటసాల ఆలాపించిన భగవద్గీతను వినకుండా ఉండలేరు. ఘంటసాలగారితో నాకు ఇరవై సంవత్సరాల సన్నిహిత్యం ఉన్నది. మీరే స్వాతంత్ర్యయోధుణ్ణయినా మరువండి. ఘంటసాలను మరువకండి. ఆయన స్వాతంత్ర్య సమరయోధుడే. ఒక్కసారి ఆయన సతీమణి సావిత్రమ్మ సంస్మరణ విందాం.

అమరగాయకుడి పేరు ఘంటసాల వెంకటేశ్వరరావు (మీలో ప్రతి ఒక్కరూ ఇక్కడ ఈ పేరునే ఊహిస్తున్నారని మాకు తెలుసు) తెలుగుపాటకు చెరగని, చెదరని చిరునామాగా నిలిచిపోయారని తెలుసు.

చినమావయ్యకి సంగీతం ఒంటబట్టిన విద్యకాదు – ఇంటబుట్టిన విద్యే! మా తాతయ్య ఈయన్ని భుజాలకెత్తుకుని, మృదంగాన్ని మెడకు వేలాడేసుకుని ఊరూరా తిరిగేవారట! హరికథలకు పక్క వాద్యకుడే. గోష్ఠుల్లో కీర్తనలూ, తరంగాలూ తాతయ్య పాడేవారట. తండ్రితో పాటే కొడుకూనూ! అలా సంగీతం చినమావయ్య స్వభావంలో భాగంగా మారిపోయింది. అలా సంగీతం ఆయనకు వృత్తిగా కాక ప్రవృత్తిగా మారిపోయింది. అదే కడదాకా కొనసాగింది. అందుకే ఆయన పాడడాన్ని అంతగా ఇష్టపడేవారు. ఒక్క మాటలో చెప్తే పాటే లోకంగా ఆయన బతికారు! ఇప్పటికీ చినమావయ్యను ఆయన పాటే బతికిస్తోంది!

### సహజత్వం వాళ్ల సొంతం

"అమ్మమ్మ (మా అత్తగారు) చాలా సహజంగా బతికిన మనిషి. గొప్ప పనిమంతురాలు! ఒంటిగానే గడ్డివాములేసేది. ఇల్లెక్కి, తాటాకు కుట్టేది. ఇంటెడు చాకిరీ ఒక్కతే చేసుకునేది. ఆవిడకి చదవడం, రాయడం తెలీదు. కానీ ఎలాంటి నమ్మకాలూ లేవు. మా పెళ్ళికి ముహూర్తం పెట్టుకునేటప్పుడు చినమావయ్య జన్మనక్షత్రం ఏఁవిటని అడిగాడు మా నాన్న . తెలియదనేసింది ఈవిడ! పోనీ పుట్టిన తిథీ, టైమూ చెప్పమన్నాడు నాన్న. 'అవన్నీ గుర్తు లేవురా అన్నయ్యా!' అనేసింది అమ్మమ్మ. ఆవిడకే కాదు – చినమావయ్యకిగాని, నాకుగానీ, మా వాళ్ళకిగానీ (నాకు తెలిసినంతవరకూ) అలాంటి నమ్మకాలేం లేవు. నేను నాస్తికురాలినేం కాదుగానీ, ఎలాంటి నమ్మకాలు లేవు. అయినా మా పిల్లలు పుట్టినప్పుడు మాత్రం అందరి పుట్టినరోజులూ, టైమూ వివరాలూ ఓ పుస్తకంలో రాసిపెట్టాను. నాకు నమ్మకం లేకపోయినా, ఇతరులకు ఉండొచ్చును కదా!



రత్నకుమార్, సావిత్రమ్మ, సుగుణ

### మామూలు మనుషులం


"మేం మద్రాసులో కాపురం పెట్టేనాటికి మన సినిమాల వాళ్ళు మామూలుగానే ఉండేవాళ్ళు. నేను అక్కడి వెళ్లిన కొత్తలో ఒకరోజు షూటింగ్ చూపిస్తానని చినమావయ్య నన్ను తీసుకెళ్లారు. 'మనదేశం' సినిమా షూటింగని జ్ఞాపకం. కృష్ణవేణిగారు వెంటబెట్టుకుని ఫ్లోర్లన్నీ చూపించారు. ఆవిడ మామూలుగానే ఉందిగానీ, సినిమా ప్రపంచం మాత్రం ఓ మాయాలోకమనిపించింది. కొద్దిసేపటికి నాకు బోరుకొట్టేసింది. కృష్ణవేణి అది గమనించినట్టున్నారు. 'మరి కొద్దిసేపుంటారా? వెళ్తారా?' అనడిగి, వెళ్తాననగానే కారులో తీసుకెళ్ళి దింపేశారు. ఓ రోజు భానుమతి 'రక్షరేఖ' సినిమా రికార్డింగ్‌కి లేటుగా వచ్చారట. ఏవో నోములన్నందువల్ల లేటయిందని చెప్పారట. వెంటనే మా ఆయన 'మా ఆవిడకూడా ఏదో నోములు నోచుకుంటోంది అన్నారు! దానిమీదట ఆవిడ మా ఇంటికి రావడమే కాకుండా వాళ్ళింటికి నన్నూ పిలిచింది. అయితే ఇప్పుడు సినిమా వాళ్ల ప్రవర్తనలో ఈ మామూలు మంచితనం హరించిపోయింది.

**సుప్రసిద్ధ నటులు, దర్శక నిర్మాత చిత్తూరు వి. నాగయ్యగారు కీర్తిశేషులైనప్పుడు ఘంటసాలగారు ఉదయాన్నే వారింటికి వెళ్ళి శ్రద్ధాంజలి ఘటించారు. నాగయ్యగారే ఘంటసాలకు నేపథ్యగానానికి 'స్వర్గసీమ' చిత్రంలో తొలి అవకాశం ఇచ్చారు. అలాంటిది ఘంటసాల నాగయ్యగారి పాటకు గొంతు అరువిచ్చారు. అదోవింత!**

### దేవుడిచ్చిన మావగారు

"మా మావగారు సూరయ్యగారిని నేను చూసిందీ, నాకు గుర్తున్నదీ తక్కువ. అయితే ఉస్తాద్ బడే గులామ్ అలీఖాన్‌గారిని నేను దేవుడిచ్చిన మాఁవగారుగా తలుస్తాను. 1953–54 ప్రాంతాల్లో నేను మా ఊరికి వెళ్ళి తిరిగొచ్చినప్పుడు స్టేషన్‌కు కారు తీసుకొచ్చారు. చినమావయ్య దార్లోనే, చిన్న హింటిచ్చారు.– 'ఇంట్లో నీకోసం ఓ సర్‌ప్రైజ్ సిద్ధంగా ఉంద'ని. ఇంటిదగ్గర చూసేసరికి మతిపోయి నంత పనయింది. గుమ్మం దగ్గిర చెప్పుల గుట్టొకటి దర్శనమిచ్చింది. ఇంటినిండా పదిమంది హడావిడిగా తిరుగుతున్నారు. ప్రతి గదిలోంచి సంగీతం వరదల్లే పారుతోంది. హాల్లో ఓ పెద్ద మనిషి పడక్కుర్చీలో సుఖాసీనుడయి, ఒళ్ళో స్వర్‌మండల్ పెట్టుకుని శ్రుతి చేస్తున్నారు. 'వీరు హిందూస్తానీ సంగీతంలో మహావిద్వాంసులు ఉస్తాద్ బడేగులామలీఖాన్ సాహెబ్'గారంటూ చినమావయ్య నాకు పరిచయం చేసారు. వినయంగా నమస్కారం పెట్టాను. నన్ను ఆశీర్వదించారాయన. "బహురాణీ! ఎక్కడా మకాం దొరకని మమ్మల్ని మీ ఆయన ఇంటికి తీసుకొచ్చారు. అయితే నువ్వు మనస్ఫూర్తిగా ఆమోదిస్తేనే నీ ఇంట ఉంటామని నేను షరతు పెట్టాను. నువ్వు నిదానంగా ఆలోచించి చెప్పు – మొహమాటపడకు!" అన్నారాయన. ఆ మాటలలోనే ఆయన వ్యక్తిత్వం ఎంత గొప్పదో నాకు అర్థమయిపోయింది. "మీ ఇష్టం వచ్చినన్నాళ్ళు ఇక్కడ ఉండండి! ఇది మీ అబ్బాయి ఇల్లు అనుకోండి!!" అన్నాను మనస్ఫూర్తిగా. అలాగే ఆయన మా ఇంట్లో నిశ్చింతగా ఉండి వెళ్ళారు. రోజుకు నలభై రొట్టెలు చేసేదాన్ని, కిరసనాయిలు డబ్బాడు గోధుమపిండి అయిదురోజులొచ్చేది. చిన్నప్పుడు విజయనగరంలో పట్రాయని సీతారామశాస్త్రి గారి దగ్గర శిష్యరికం చేసినట్లే చినమావయ్య ఖాన్‌సాహెబ్‌గారి దగ్గిర కూడా శిష్యునిగా మెలిగేవారు. ఆయనా, ఈయనా సంగీతం గురించి ఎడతెరపి లేకుండా మాట్లాడుకొనేవారు– అన్నారా సావిత్రమ్మ. ఒప్పు అంటున్నాను నేను. ●

# చెన్నయ్‌లోని ఓ తెలుగు పెద్ద ఇ.ఎస్. రెడ్డిగారు!



ఆయనెపుడూ చిరునవ్వులు విసురుతూంటారే గానీ, చికాకుపడిన సందర్భాలు లేవు. ఆంధ్రాక్లబ్‌లోనూ, తెలుగు మహాజనసంఘంలోనూ, ప్రప్రథమంగా జరిగిన ప్రపంచ తెలుగు సమాఖ్య సభల్లోనూ అకుంఠిత కృషి చేస్తారు. అంతకన్నా విశేషం K.C.P. దత్తుగారి నుంచీ తొలిచెక్కు తెచ్చి 'ప్రముఖాంధ్ర'ను ప్రోత్సహించిందీ, రామరాజ్ ప్రింటర్స్ బిల్లుల చెల్లింపుచేసిందీ ఆయనే!

ఆయన పూర్వం సోషలిస్టు పార్టీలో ప్రధాన భూమిక వహించారు. సోషలిజంలో ఆయన్ను మించిన వారు లేరు. నా సతీవియోగం జరిగినపుడు ప్రత్యేకంగా వచ్చి ఓదార్చిన సహృదయుడు. ఏ తెలుగు సభలు జరిగినా ముందుగా వస్తారు. వెనుక కూర్చుంటారు. ఏదైనా విషయం వస్తే ముఖమ్మీదే మాట్లాడతారు. దాచుకునే స్వభావం కాదు. 83 సంవత్సరాల్లో చలాకీగా ఉన్నారంటే ఆయన నిష్కల్మష హృదయమే!

## ఆటపాటల చదువు అటకెక్కి పోయింది!
## స్కూలు బాగులు మోసి గూని వచ్చింది!
### -జ్ఞానశూన్యులనే పేరుగెక్కామూ!-

ఆట మాణిక్యమే పాట మాణిక్యం
మా యింటి బాలలు మంచి మాణిక్యం
అనే రోజులనూ విద్యావిధానం మొదలుకంటూ నరికివేసింది
స్వాతంత్ర్యానన్తర ప్రభుత్వం!
వెన్నముద్దల కృష్ణుడు ముద్దుయే నీకు యశోదా!
తన్ను గుద్దుల గాడిద బరువు చదువులయ్యె మాకు
స్కూలు బ్యాగులు మోయలేక మేము చస్తుంటే-
కొట్టని ఉపాధ్యాయులు లేరు, తిట్టని తల్లితండ్రులు లేరు!
విద్య నేర్పెహక్కు మీకుందెగానీ,- గానుక యెద్దులా త్రిప్పే హక్కు మీకెక్కడుందీ?
గాడిద కొడకా యంటే గాడిదొప్పదు మమ్మూ!
కుండీలో పెరిగే మొక్కలకైనా నిండైన గుండెలర్పిస్తారు మీరు!
అక్షరాల తల్లికి వీణబొర్రే ఆభరణం-
మాకేంమో మాకేమో బడిబాగుల బరువే శాపం!
ఓ బొజ్జగణపయ్య ఒజ్జగా చెప్పవయ్యా!

– ఈనాటి చదువులేమో రాక్షసత్వంగా ఉన్నాయి. జ్ఞానంబు సున్న, విద్యా డిగ్రీలు మిన్నయి కూర్చుంటున్నాయ్. ఇంజనీరింగు చదువులొచ్చి ఇంగితమంతా పోయింది. రోలు రోకళ్ళలా – ఆ చదువులు చదివి ఆడమగా కలిసి గొడ్డు చాకిరీ ఉద్యోగాలు చేస్తేగాని నెలగడవదు. కలిగిన పిల్లలను చూడలేక, వాళ్ళనొక అమ్మ పనుపున వుంచీ, వాత్సల్యాలను పంచలేక పోతున్నారు. గొడ్డు చాకిరి చేసి, ముప్ఫై యేళ్లకే ముదుసలిలవుతున్నారు. ముగ్ధమోహనం పోతుంది. స్నిగ్ధ సౌందర్యము పోతుంది. విసుగిసుగులు రగిలి విడాకులో, పెడాకులో అవుతున్నారు. ఆంధ్రరాష్ట్ర మేర్పాటు అయ్యాక, మాతృభాష శత్రుభాషయ్యింది. మనసైన మనోరంజితమైన మన భాషకన్నా ఉద్యోగాలడుక్కుతినే భాష ఆత్మగౌరవ భాషగా తలుస్తున్నారు. బాలల భవిష్యత్తుకు పచ్చనోట్లకు బలైపోతుంది. బడులలలోని బాల్యం యెగిరే గాలిపటమైంది; చేసే ఉద్యోగం తెగిన గాలిపటమైంది. ఇలా వుంటే ప్రకాశం పంతులూ, పట్టాభిలెలా కాగలుగుతారు?



అందుకే ఆ జయపాలరెడ్డీశ్వరుడు ఆంధ్రులను 'శుంఠ'లన్నాడూ; ఆయన ఆంధ్రుడు కాదాయేంమి? పాంథుడా – భద్రాచల రాముడా చెప్పవయ్యా

ఓ ప్రక్క తెలంగాణా (కొత్తగా పుట్టిన తెలివి) మరో ప్రక్క సీమాంధ్ర చేతులు లాగుతున్నప్పుడు 'ధర్మపురుషుడువు గాన నోరు విప్పవు- పోనీ, నా బాలలను మాతృభాష నేర్చుకునేందుకు పోరాడుము కీర్తి వస్తుంది. ●

# పాలకొల్లు కళాకారుడు శ్రీమాన్ ఆచార్య S.K.

కళాకారులకు కొదువలేని తెలుగు గడ్డ పాలకొల్లు. దురదృష్టవశాత్తూ ఎందరో కళాకారులు సరైన గుర్తింపు, గౌరవం లేక మరుగునపడిన విషయం, ఆర్థిక, ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న విషయం మనకు తెలియనిది కాదు. కులం, ధనం, అవకాశవాదం, వారసత్వం తదితర బ్రతుకుతెరువు లక్షణాలు లేక సత్తా ఉన్నవారు ఎందరో కళాకారులు రాణించలేక మరుగునపడటం చూస్తూనే ఉన్నాం. అలా మరుగనపడినవారిలో కళాకారుడు, విభిన్న పాత్రలలో వందల సినిమాలలో నటించి, వేల సంఖ్యలో పురాణ హరికథలు చెప్పి తెలుగు ప్రజలను సమ్మోహనపరచిన శ్రీమాన్ ఆచార్య S.K. ఎదుగు లేక అలాగే ఉన్నారు. ప్రభుత్వోద్యోగిగా ఉంటూనే, కళారంగంలో తనైదన ముద్రతో ప్రముఖ నటునిగా ఎదిగిన వ్యక్తి – శ్రీమాన్ ఆచార్య S.K, దర్శకరత్న డా॥ దాసరి నారాయణరావు లాంటి వారిచే ప్రశంసలు, సత్కారాలు పొందినా, రాష్ట్రస్థాయిలో ఎన్నో సాంస్కృతిక సంస్థలు, ఎందరో వ్యక్తులు సన్మానాలతో ముంచెత్తినా, వీసమెత్తయినా ఎగసిపడని, నిగర్వి. కలం స్నేహాలతో పరవశించే బోళాశంకరుడు. ఆర్జించడం తెలియని అమాయకుడు. హరికథలు, పురాణాలు చెప్పి శ్రీ ఆచార్య కళాకారునిగా కాసులు సంపాదించలేకపోగా తన కొచ్చే పెన్షన్ కూడా వితరణ చేసే వింత శీలుడు. అందరికీ ఆత్మీయులు. అందరి శ్రేయస్సు కోరేవాడు. చలనచిత్రసీమలో పెద్ద పెద్దల పరిచయమున్నప్పటికినీ వెనకేసుకున్నది లేదు.

కం॥ దస్కత్తు లొసగని – పురస్కారములందగలుగు రసవన్నిధి యా
ఎస్కే ఆచార్యునకు – నమస్కార శతంబులిడుదు మాన్యుండనుచున్॥ – రాధశ్రీ



కోడి రామకృష్ణ, రేలంగి నరసింహారావు దాసరి నారాయణరావులతో ఎస్.కె.ఆచార్య

# కస్తూరిమాత ఇంక మనకు కానరాదండీ! కఠినమైన జైళ్ళలోన కాలమందిందీ!

**- 1944 సం॥ము ఫిబ్రవరి 22వ తేదీన కాలం చేసింది! -**

అప్పటికి నేను పదకొండేండ్లవాడిని. మా అమ్మ నాగభూషణమ్మ పోయిన దుఃఖంలో ఉన్నాను. పాలకొల్లు వీధుల్లో అందరూ ఏడుస్తూ, పాటపాడుతూ, కాంగ్రెసు జెండాలు పట్టుకుని వెడ్తున్నారు.

**కస్తూరిమాత యింక మనకు కానరాదండీ! కఠినమైన జైళ్ళలోన కాలమందిందీ తల్లీ కాలమందిందీ'** అంటూ ఏడుస్తూ వెడ్తున్నారు. నాకూ ఏడుపువచ్చింది. ఏడుస్తున్నదెవరికోసమో తెలియదు. కానీ ఏడుపులో ఓ గొప్ప విశేషమున్నది. గుండెల్లోని బాధను కడిగివేస్తుంది. అందుకే ఏడుపు చివర్న 'అమ్మా, రామా! కృష్ణా' అంటాము. 'అమ్మ' పేరూ, దేవుని పేరూ పెదాలుపైకి వస్తుంది. తడారిని పెదాలు తడుస్తాయి.



విషయానికి వద్దాం. 74 ఏండ్లక్రిందటి మాట కదా! కస్తూరిమాత పోయిందన్నారు. - ఏవిఁటి అంటే కస్తూరిబాయి. ఇంకా నొక్కి అడిగితే కస్తూరిబా గాంధీ. మహాత్మాగాంధీగారి భార్య. మన అందరి అమ్మ అన్నారు. తెలుగువాళ్ళు గాంధీగారి కుటుంబాన్ని అంత విశ్వాసంలోకి తీసుకున్నారు.

ఆ రోజు 1944 వ సంవత్సరం ఫిబ్రవరి 22వ తేదీ కారాగారంలో ఉంటూనే చనిపోయిందన్నారు. కొందరి వార్త ప్రకారం ఆ రోజు ఆమెకు శ్వాస తీసుకోవడం కష్టమయింది. ఇంగ్లీషు డాక్టర్లు ఆమెకు తక్షణ కర్తవ్యంగా ఇంగ్లీషు వైద్యం యాంటీబయొటిక్ పెన్నిలిన్ ఇంజెక్షన్లు యివ్వడం అవసరమన్నారు. (ఆ పెన్సిల్ కనిపెట్టినది కూడా మనవాడు సుబ్బారావే). గాంధీగారు ఆంగ్ల వైద్యం చేయడానికి ఒప్పుకోలేదు. ఆయన తనయుడైన దేవదాసు గాంధీ తల్లిబాధను చూడలేక గాంధీ గార్నీ, వైద్యుల్నీ ప్రక్కగదిలోకి తీసుకువెళ్ళి నచ్చచెప్ప ప్రయత్నించాడు. బ్రతిమాలాడు బామాలాడాడు. గాంధీగారు ఒప్పుకోలేదు. డాక్టర్లు మాత్రం ప్రతీనాలుగుగంటకీ ఒక పెన్సిలిన్ ఇంజెక్షన్ యివ్వాలనీ, ప్రమాదం ముంచు కొస్తుందని చెప్పారు. కొడుకు దేవదాసు గాంధీతో గాంధీగారు ససేమిరా అంటూ ఆ యింజెక్షన్లుతో మీ తల్లి శరీరం తూట్లు పొడవడం ఎందుకని నచ్చచెప్ప బోయారు. దేవదాసు గాంధీ సమాధానపడక పోయిననూ, చెబుతున్నది తండ్రియని సంధిగ్దావస్థలో ఉండగానే ప్రక్క గదిలోంచి పిలుపు రావడంతో గాంధీగారు దేవదాసుగాంధీ లిరువురూ వెళ్ళారు. శ్వాస అందక ఆమె ఆఖరి చూపులా అన్నట్టు ఆవేదనా చూపులు చూస్తున్నది. కస్తూరిబా చరమావస్థను చూడలేని గాంధీ ఆమెను తన రెండు చేతుల్లోకి తీసుకున్నారు. ఆమె అలాగే గాంధీ చేతుల్లో ఆఖరిశ్వాస విడిచారు. అప్పుడా ఇరువురూ కారాగార జీవితమే గడుపుతున్నారు. అలనాడు దేవకీ వసుదేఁవులు శోకగర్భంతో పరం ధామునికి జన్మయిస్తే, 1944 సం॥ము ఫిబ్రవరి 22న రాత్రి గాంధీ చేతుల్లో కస్తూర్బా అసువులు విడిచింది. ఆనాడు కారాగారంలో పరమాత్ముని జననం ఇలనాడదే అర్ధరాత్రి మహాత్ముని సతీమణి కస్తూరిమాత మరణం. దేశం, ముఖ్యంగా ఆంధ్రదేశం గగ్గోలు యెత్తింది. అంతటి దేశనాయక భక్త ప్రియులు ఆంధ్రులు- (ఈనాడు తమ హస్తాలతో కార్పణ్యంతో తామే రాష్ట్రాన్ని కాష్టభూమి కావిస్తున్నారు.)

కస్తూరి ఆ పేరు కపాడియా వంశీయులు ఏ సుమూహర్తమున పెట్టారోగాని- ఆమె గాంధీకన్నా దేశంలో మంచిపేరు, ప్రేమలను పొందారు.

ఆమె కూడా గుజరాత్‌లోని పోర్‌బందరులోనే 1869 సం॥ము ఏప్రియల్ 11న జన్మించారు. ఆమె 13వ సంవత్సరంలో 1882లో గాంధీని వివాహమాడారు. దక్షిణాఫ్రికాలో గాంధీ ప్రారంభించిన ఉద్యమంలో ఆమె పాల్గొన్నారు. వివాహమైనప్పట్నుంచీ ఆమె భర్తే దైవం అన్నట్లుగా ఆమె జీవితంలోని చాలాకాలం జైళ్ళలోనే గడిచింది. ఒక్కొక్కప్పుడు గాంధీజీ ఆమె పట్ల కఠినంగా వ్యవహరించేవారు. ఆమె మారుమాట పలికేది కాదు. గాంధీగారు తన మాటే శాసనం అన్నట్లు ఆమె పట్ల వ్యవహరించేవారు. గాంధీగారొకసారి ఆయన ఆశ్రయం కల్పించిన రోగి విడిచిన మలమూత్రాలను శుభ్రం చేయమన్నారామెను. ఆమె చేయలేనన్నది. అయితే - నువ్వు నా యింట్లో ఉండడానికి వీలులేదని అర్ధరాత్రి పూట యింట్లోనుంచీ బయటకు గెంటేసారు.,

నీవు నేర్పినదే నీరజాక్ష- అంటూ ఆమె అర్ధరాత్రి ఇంటి బయట గాఢ చలిలో 'నా భర్త, నా యిల్లు, ఇది నా నీడ' అంటూ ఆమె అక్కడే కృశిస్తూ ఉండిపోయారు. తరువాత గాంధీగారే ఉదయం పశ్చాత్తాపపడి ఇంట్లోకి తీసుకుని వెళ్ళారు.

గాంధీ చెప్పినట్లు వినకపోతే - ఆగ్రహించే వారు, నిరశన వ్రతం చేసేవారు. అదే సత్యాగ్రహం. సత్యాగ్రహంలో హింస ప్రజ్వరిల్లింది. ఆయనపై అత్యంత గౌరవం చూపిన రవీంద్రనాధ్ ఠాగూర్ కొన్నాళ్ళు కినుక వహించి రావడం మానివేశారు. ఆయన సత్యాగ్రహం వలన ప్రయోజనం లేదని నేతాజీ సుభాష్ చంద్రబోసు విభేదించారు. అఖిల భారత కాంగ్రెసు అధ్యక్షపదవికి గాంధీజీ సూచించిన భోగరాజు పట్టాభిసీతారామయ్యపై పోటీచేసి విజయం చేపట్టారు. తరువాత ఆ పదవిని గాంధీ వ్యక్తులకే అప్పగించి, ఆజాద్ హింద్ ఫౌజ్ సైన్యాన్ని స్థాపించి సమరసన్నాహుడై జపాను చేసిన ద్రోహంతో ఏమైనదీ అంతుబట్టలేదు. అందుకే ఆనాటి పిల్లలం - **జపాను అనగ నెంతరా! దాని తాహతెంతరా! అంతా గలసి తంతె మళ్ళీ అంతు దొరకునంటరా!** అని పాడేవాళ్ళం.

## నిరంతర సత్యం

ఇంతకూ నేను చెప్పగలిగిందొక్కటే! ఆ రోజులు వేఱు; ఆ స్వతంత్ర్య భావాలు వేఱు! ఎవరి తలమీద చేయిపెడదామా అనే ఈ నాటి రోజులు వేఱు. ఆనాటివి త్యాగాలూ! ఈనాటివి భోగాలు. ●

ధర రూ. 1000/- మాత్రమే

ఇంద్రజాల తాయత్తు

Indrajal Thayath

ఇంద్రజాల మొక్కలు అరుదుగా లభించే సముద్రపు మొక్కలు. పేరుకు తగినట్లే ఈ మొక్కలకు అద్భుత శక్తులున్నాయి. దీని ప్రస్తావన, శక్తి గురించి రావణ సంహిత, విశ్వసార, దావరతంత్ర మొదలగు అనేక పవిత్ర గ్రంథాలలో వివరింపబడివుంది. ఈ ఇంద్రజాల తాయత్తును ధరిస్తే ఆర్థిక ఇబ్బందులు ఒక కొలుక్కి వస్తాయి. మొండి బాకీలు వసూలౌతాయి. ఎప్పుడో తర్వాత రావలసిన పదవి, ప్రమోషన్, ధనలాభం ఇప్పుడే దక్కుతుంది. రాజకీయనాయకులు, ఉద్యోగస్తులు, అధికారులు, వ్యాపారస్థులు, విద్యార్థులు, అవివాహితుల ఈ ఇంద్రజాల తాయత్తును ధరిస్తే వారి జీవితంలో ఊహించని మార్పులు సంభవిస్తాయి. కుటుంబంలో మనశ్శాంతి కలిగిస్తుంది. ఈ తాయత్తు ధరించిన వారిపై ఎవరూ చేతబడి చేయలేరు.



డా॥ మల్లంపల్లి రామలింగ శాస్త్రి

భక్తిటుడే పవిత్ర సామాగ్రి పరిశోధన నిలయం

Bakthitoday Pavithra Saamagri Parisodhana Nilayam

Ph. : 044-24837505, 09840259871

Visit : www.bakthitoday.blogspot.com www.indiamart.com/bakthitoday-pavithra



# ఏదీ పులి? ఏదీ గోవు?

## (జాతీయ జంతువుగా 40 ఏళ్ళు)

అప్పుడు అడవులు ఎక్కువగా ఉండేవి. జంతువులు ఎక్కువగా ఉండేవి. జనావాసాల మీదకు క్రూరజంతువులు దాడులు చేయకుండా కాపాడేందుకు వేట జరిగేది. ఇప్పుడేమో జనారణ్యంలోకి వచ్చి కనుమరుగవుతూన్న భారత జాతీయ జంతువు పులి! దీనితో పులిని జూలో మాత్రమే చూసే దౌర్భాగ్యం వస్తున్నది.

భారతదేశ జాతీయ జంతువైన పులి నేడు కేవలం కొన్ని వందల సంఖ్యలో మనుగడను సాగిస్తున్నది. అందమైన చర్మాలు, ఇతర శరీర భాగాల కోసం పులులను అక్రమంగా వేటాడుతూనే ఉన్నారు. మనుషులను కూడా వేటాడే క్రూరమృగంగా పేరున్నా, నైజానికి పెద్దపులి చాలా హుందాయైన జంతువని అభిప్రాయపడ్డారు. సాధారణంగా మనుషులకు దూరంగా సంచరించే పులి, అరుదుగా, వయసు మీదపడ్డప్పుడు, గాయపడి సాధారణంగా వేటాడే జంతువులను వేటాడలేనప్పుడు మాత్రమే మనుషులను వేటాడుతుంది. కానీ మనిషో?

విజ్ఞతలేని పాలకుల తీరు.. అభయారణ్యాల పరిరక్షణలో చిత్తశుద్ధిలేమి.. నగరీకరణ... వెరసి జాతీయ జంతువైన పులుల మనుగడను ప్రశ్నార్థకంగా మార్చేస్తున్నాయి. పెద్దలపులులను భవిష్యత్ తరాలు జూలోనూ చూడలేవంటున్నారు. నాగరిక సమాజం పులల పాలిట శాపంగా మారుతోంది. కారణం.. సాధువైన గోమాతకు చేస్తున్న పాపమే! అప్పట్లో పులుల సంఖ్య 268, టైగర్ ప్రాజెక్టులను సర్కారు 27 రక్షిత అడవులకు పెంచి పులుల సంఖ్య 1498కి చేరుకునేలా ప్రయత్నించింది. శాస్త్రీయ విధానాలతో పులుల జనాభాను లెక్కిస్తూ వాటి పాదముద్రలు (పగ్‌మార్క్స్) పులి వదిలే విసర్జనాలను పరిగణనలోకి తీసుకుని సంఖ్యను గణిస్తూంటారు. సాధుజీవులు గోవులను కబేళాలకు పంపుతున్న పాపాన్ని మనం అనుభవిస్తున్నాం.




అన్నదానం... అభయదానం.. ఆరోగ్యదానం.. విద్యాదానం.. గోదానం.

అఖండంగా కొనసాగుతున్న దేశంలో దానాలు మృగ్యమైపోయాయి. ఆధ్యాత్మికతలోని అపారమైన శక్తినిచ్చే మాత. గోవు కెక్కడా స్థానం లేదు. పంచ మాతల్లో ప్రధానమాత గోమాత అని గ్రహించిననాడే పరమార్థం.

## సర్జరీ చేయించుకుని కృత్రిమంగా బ్రతుకనన్న ఐన్‌స్టీన్!

ఆయన ప్రసిద్ధ శాస్త్రవేత్త! ఆయన పేరు ఐన్‌స్టీన్. ఆ పేరు ఎరుంగని శాస్త్రజ్ఞులుండరు. ఆయన చివరి రోజుల్లో తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. తోటి మిత్రులు డాక్టర్లను పిలిపించి పరీక్ష చేయించాలన్నారు. నేను ఎప్పుడు పోవాలని వ్రాసి ఉంటుందో అప్పుడు పోతాను కానీ, శస్త్రచికిత్స చేయించుకుని కృత్రిమంగా జీవితాన్ని పొడిగించను- అన్నాడు. ఆయనకు తెలుసేమో ఒక్కసారి ఆ ఆసుపత్రిలో ప్రవేశిస్తే జీవితాంతమూ వైద్యుల చుట్టూ తిరిగి మందులు వ్రాయించుకుని జీవితపర్యంతమూ ఔషధసేవనం చేస్తూ బ్రతకవలసి వస్తుందనుకున్నాడు. ఇప్పుడు అయిదూ, పది ఇరవైలక్షలు ఖర్చు పెట్టుకుంటూ, ఇల్లు, వాకిలీ అమ్ముకోవాలనో, లేదా పిల్లల కష్టార్జనాన్ని ఖర్చుపెట్టాలనో భావించాల్సి వస్తే ముందుగానే చంపేమందులివ్వాలనేవాడేమో!



విద్యా, వైద్యం వ్యాపారమై పోయింది. ఎలా లక్షలు సంపాదిద్దామా- అని చూస్తున్నారు. ఒక రకంగా వారు పాతిక లక్షలూ, అరకోటి పోసి వైద్యకళాశాలల్లో సీటు సంపాదించినపుడు వారందరికి గిట్టుబాటు కావాలి. ఆసుపత్రులు కట్టినవారు డాక్టర్లు, రక్త పరీక్షలు, ఇ.సి.జి.లు స్కాన్‌లూ, వ్రాయమని యాజమాన్యం ఒత్తిడి చేస్తారు. ఆ ఒత్తిడీ, ఈ ఒత్తిడి పెరిగి వ్యాధిగ్రస్థుడు చస్తాడు. లేదా వాళ్ళ సంతానాన్ని ఆర్థికంగా చంపేస్తాడు. ●

SRI RAJARAJESWARI JEWELLERY

The Oldest Jewellery Shop in Pondy Bazaar

81, Pondy Bazar, T. Nagar, Chennai - 600 017.
Phones : 28152387, 28154653

*The Purest Treasurer Mortal Times Afford is Spotless Reputation*

# దేశంలో బాంబు పేలుళ్ళు జరుగుతున్నాయి వాటిని అరికట్టడంలో ప్రభుత్వం వైఫల్యం చెందిందా?

త్రిపురనేని హనుమాన్ చౌదరిగారు మా శ్రేయోభిలాషులు. నాకన్నా రెండు మూడు సంవత్సరాల పెద్ద. చెన్నయ్ వస్తే నన్ను చూడకుండా వెళ్ళరు.

దేశంలో టెలిఫోను సాంకేతిక రంగానికెంతో సేవ చేసారు. ఎస్.టి.డి. టెలిఫోను విధానానికి ఆయనే ఆద్యులు. ప్రఖ్యాత రచయితలూ, సంఘసంస్కరణాభికర్తలైన కీ.శే. త్రిపురనేని రామస్వామి చౌదరి సంతతి వారు. వారి నాస్తికవాదాన్ననుసరిస్తే, మా మిత్రుడు డా॥ హనుమాన్ చౌదరిగారు సనాతన ధర్మపురాణాలన్నీటినీ వారు ఔపోసన పట్టారు. స్వాతంత్ర్యానన్తర చరిత్రనంతా అధ్యయనం చేసి, కరతలామలకం చేసుకుని, భారతీయుల్ని మేలుకొలుప డంలో అనేక గ్రంథాల్ను రచించారు. ఆంగ్లంలో నిశిత చరిత్ర పారాయణంగా ఓ ఆంగ్ల పత్రికను కూడా నడుపుతున్నారు. వెయ్యికి ఒక్కరైనా ఆయన కలాన్ని అర్థంచేసుకుంటే ప్రజలు బలవంతులవుతారు. దేశాన్ని బలవర్థితం చేస్తారు. వారికి సంపూర్ణ ఆయురారోగ్యాలను భగవంతుడు ప్రసాదించాలని చేతులెత్తి ప్రార్థిస్తున్నాను.

– గోటేటి శ్రీరామారావు



పాకిస్తాన్ భారతదేశానికి ఆగర్భ శత్రువు, భారత ఉపఖండంలో ముస్లింలు భారతీయులు కాదని, వారు వేరే జాతి అని, భారతదేశాన్ని విభజించి, వారికిగాను పాకిస్తాన్‌ను ఇస్లాం రాజ్యంగా ఏర్పరచుకున్నారు. భారతదేశంలోని ముస్లింలు 1945–46 సం॥లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో 86%మంది ముస్లింలీగ్‌కి ఓటువేసి విభజన ఢంకా భజాయించారు. లీగ్ నాయకులు పాకిస్తాన్ – హిందూస్తాన్‌ల మధ్య మైనారిటీలను ఎక్ఛేంజ్ జరపాలని కోరారు. ఈ ఎక్ఛేంజ్ జరగకపోయినట్లయితే, భారతదేశాన్ని ముస్లిముల సమస్య పీడిస్తుందని డా. అంబేద్కర్ చెప్పారు. పాకిస్తాన్, బంగ్లాదేశ్‌లలో ఉంటున్న హిందువులను, సిక్కులను, బౌద్ధులను వెళ్ళగొట్టేశారు. కాని భారతదేశంనుంచి ముస్లింలు పాకిస్తాన్‌కు వెళ్ళటాన్ని గాంధీ – నెహ్రూ, కాంగ్రెస్‌లు ఒప్పుకోలేదు. మేము భారతీయులం కాదన్న పాకిస్తాన్ నిర్మించిన, భారతదేశాన్ని విభజించిన ముస్లింలు ఇక్కడే వుండి 1951 సం॥లో 10 % నుండి ఇప్పుడు 16%–20% వరకు పెరిగిపోయారు. పాకిస్తాన్‌లో ఇస్లామిస్ట్ ఫండమెంటలిస్ట్‌లు భారతదేశాన్ని ముక్కలు ముక్కలుగా చేసి తిరిగి మొఘల్‌కాలంలో మాదిరిగా ముస్లిం పాలిత దేశంగా చేయాలను కుంటున్నారు. భారత్‌తో ప్రత్యక్ష యుద్ధం చేసి మూడుసార్లు పాకిస్తాన్ ఓడిపోయింది. ఆ ప్రభుత్వపు గూఢచారి వ్యవస్థ (ఐఎస్ఐ) ముస్లిం ఉగ్రవాదుల్ని తయారు చేసి, భారతదేశంలోని కొంతమంది ముస్లింలను కూడా వారికి అనుబంధితులుగా, అనుయాయులుగా తయారుచేసి, వారిమతంలో జిహాద్ అనే (మతవ్యాప్తికి, మత రక్షణకు, అన్యమతస్థుల మీద యుద్ధం చేయడం) ప్రయోగం ద్వారా భారతదేశంలో విచక్షణా రహితంగా బాంబులు పేల్చి, ప్రజలను భయభ్రాంతులను చేసి, వారికి లొంగేట్లుగా చేయసంకల్పించింది. ఆ దేశపు ఒక ప్రధాని భారతదేశం మీద, వేయి గాయాలు పెట్టి నాశనం చేస్తామని గట్టిగా చెప్పారు. ఆ పాలసీ ప్రకారం, మత కలహాలు సృష్టించడం, బాంబులు పేల్చించడం జరుగుతోంది. ముస్లింల ఓట్ల కోసమే నానాపాట్లు పడే రాజకీయపక్షాలు, వారి ప్రభుత్వాలు బాంబులు వేసే ఉగ్రవాదులను, వారికి ఆశ్రయమిచ్చే వారిని ఎన్నో విధాల సహాయం చేసి వారిని నియంత్రించి, శిక్షిస్తే ఓట్లు రాలవని మెత్తగా వ్యవహరిస్తున్నారు. అనుమానితులను నిర్బంధిస్తే, దాన్ని ముస్లిముల మీద దాడిగా చిత్రిస్తున్నారు. ప్రధానంగా ఓట్లవేటగాళ్ళ మెత్తదనం మూలాన బాంబు ప్రేలుళ్ళు నిరాఘాటంగా సాగుతున్నాయి. యుపిఏ ప్రభుత్వం వచ్చిన 9 సం॥లలో 38 సార్లు బాంబు పేలుళ్లు జరిగి వందలమంది చనిపోయారు. వేలమంది గాయ పడ్డారు. ఈ జిహాదీలను అదుపులో పెట్టడానికి ఎన్‌డిఏ ప్రభుత్వం చేసిన చట్టాలను ముస్లింలకు వ్యతిరేకులు అనే ముద్రవేసి ఆ చట్టాలను రద్దు చేసింది. సెక్యులర్ అని చెప్పుకునే పార్టీ ప్రభుత్వాలు ఉగ్రవాదులను, బాంబు పేలుళ్ళను స్వయంగా ఆపలేక, "మీరు ఆపండి" అని పాకిస్తాన్ ప్రభుత్వాన్ని, అమెరికన్ ప్రభుత్వాన్ని అర్థిస్తున్నాయి. ఇటువంటి పరిస్థితులు కొనసాగినంతసేపూ, ఒక మతస్థుల ఓట్లకోసం పోటీపడి ప్రయత్నించే ప్రయత్నాలు కొనసాగినంత వరకూ జిహాదీ బాంబు పేలుళ్లను మన ప్రజలు అనుభవించవలసిందే!

అంబేద్కర్‌గారు హైదరాబాద్‌ను దేశ రెండవ రాజధానిగా చేయమని అన్నారు. ఆయన మహాద్రష్ట. సుదీర్ఘంగా ఆలోచన చేసేవారు. ఆయన బడుగులొక్కరి కోసం కృషి చేసారనడం సరికాదు. దేశ సంక్షేమం కోసం కృషి చేసారు. హిందుమతంతో విభేధించినా క్రైస్తవంలోకి మారలేదు. దేశమతమైన బౌద్ధమతంలో చేరారు. రాజ్యాంగ రచనకర్తల్లో ఆయన ప్రధాన పాలు పంచుకున్నారు.

# గుమ్మడిలోని ఆరోగ్యగుణాలు

గుమ్మడిలోని పాలీ ఫినాలిక్‌ప్లేవోనాయిడ్లు రోగనిరోధకశక్తిని పెంచుతాయి. జియోక్యాంథిన్ వృద్ధాప్యంలో వచ్చే రెటీనా సమస్యల్ని తగ్గిస్తుంది. ఇవి ఇన్సులిన్‌ని ప్రభావితం చేస్తాయి. అందుకే డయాబెటీస్ రాకుండా ఉండేందుకు, వచ్చినవాళ్ళకి గుమ్మడి మంచిది. ఈ విషయాన్ని ప్రయోగపూర్వకంగా నిర్ధారించారు.

- గుమ్మడిలో ఉండే పీచువల్ల కొలెస్ట్రాల్ పెరగకుండా ఉంటుంది. అందుకే ఇది హృద్రోగులకు మంచి కూరగాయ.
- ఈ గుజ్జుని తినడం వల్ల ఊపిరితిత్తుల్లోని కఫం తగ్గడంతోపాటు, మైగ్రెయిన్లూ తలనొప్పి కూడా తగ్గుముఖం పడుతుంది. గ్యాస్ట్రిక్ సమస్యలుండవు.
- బికాంప్లెక్స్ విటమిన్లు, కాపర్, కాల్షియం, పొటాషియం, జింక్, ఫాస్పరస్ వంటి ఖనిజాలు కూడా గుమ్మడిపండు నుంచి లభిస్తాయి.
- గుమ్మడి నుంచి తీసిన గుజ్జు పెంపుడు జంతువులైన పిల్లి, కుక్కలకు ఎంతో మంచిది. కోళ్ళకి కూడా ఇది మంచి మేత. గుమ్మడి తురుము లేదా గుజ్జు వాటికి ఆహారంలో భాగంగా ఇవ్వడం వల్ల గుడ్ల ఉత్పత్తి పెరుగుతుంది.
- గింజల్లో ప్రోటీన్లూ ఖనిజాలు విటమిన్లూ ఒమేగా–3, ఫ్యాటీ ఆమ్లాలూ సమృద్ధిగా ఉంటాయి. ఇవి గుండెజబ్బుల్ని తగ్గించడంలో కీలకపాత్రను పోషిస్తాయి. ముఖ్యంగా వీటిల్లో చర్మానికి మేలుచేసే విటమిన్–ఇ, విటమిన్–కె సమృద్ధిగా ఉన్నాయి. ఇందులో పుష్కలంగా ఉండే మెగ్నీషియం ఆయుష్షును పెంచేందుకు దోహదపడుతుంది.
- 100 గ్రాముల గింజల నుంచి 559 క్యాలరీలు లభిస్తాయి. వీటిల్లో 30 గ్రా ప్రోటీన్లు ఉంటాయి. మెదడును ప్రభావితం చేసే ట్రిప్టోఫాన్ అనే అమైన్ ఆమ్లం కూడా ఈ ప్రోటీన్లలో ఉంటుంది. వీటిని క్రమం తప్పకుండా తినడం వల్ల కిడ్నీల్లో రాళ్ళు ఏర్పడే సమస్య తగ్గుతుంది. బద్దెపురుగుల్లాంటి పరాన్నజీవులు పొట్టలో పెరగకుండా ఉంటాయి. మలబద్ధకమూ తగ్గుతుంది.
- గింజల్ని తరచూ తీసుకోవడం వల్ల బరువు తగ్గడంతోపాటు కొలెస్ట్రాల్ అదుపులో ఉంటుంది. శరీరంలో కొవ్వు పేరుకోకుండా చేస్తాయని ఆయుర్వేదం చెబుతోంది. వీటిని ఎండబెట్టి, వేయించి లేదా పచ్చిగాగానీ తినవచ్చు.
- గుమ్మడి విత్తులు లేదా వీటినుంచి తీసిన నూనె కూడా చాలా మంచిది. ఇది రుమటాయిడ్ ఆర్థ్రయిటిస్‌నీ బీపీనీ ప్రోస్టేట్ క్యాన్సర్లనీ మూత్రాశయ సమస్యల్ని, నిద్రలేమినీ తగ్గిస్తుంది. చర్మానికీ, మెదడుకీ ఎముకల ఆరోగ్యానికి కూడా మేలు చేస్తుంది.

**"వీరీ వీరీ గుమ్మడి పండు వీరి పేరేమి"** అంటూ గుమ్మడిని ఆటపాటలకో ప్రత్యేక వేడుకలకో పరిమితం చేయకుండా వంటింట్లోనూ తగిన ప్రాధాన్యాన్ని కల్పిస్తే అది అద్భుత ఆరోగ్య ఔషధ భాండాగారంగాను ఉపయోగపడుతుంది.


*Compliments from*

**Sri Krishna Bhat**

When you come to
Holy Pilgrimage Centre Tirupati & Tirumala

**WOOD SIDE ANNEXE**
Opp. to Govindarajulu Temple, 20. E.car Street, Tirupathi.

**WOODSIDE**
Ring Road, Tirumala. Ph : 517504

**HOTEL WOODSIDE**
E.Car Street, Tirupathi. Ph : 2284464

# వృద్ధులమైతిమని కృద్ధులు గాకండి కృద్ధులైనకొద్దీ వృద్ధత్వం కక్షబూనుతుంది!



కొన్ని నియమాలను పాటించిననాడు వృద్ధత్వం ఆరోగ్యాన్ని ప్రసాదిస్తుందంటున్నారు సర్వజన శ్రేయఃకాముడైన **రచయిత జానుమద్దిహనుమచ్ఛాస్త్రి.**

**1. కాళ్ళు - పాదములు**

1. మీ కాలివ్రేళ్ళను 10 సెకండ్లపాటు క్రిందికి వంచండి.
2. కాలివ్రేళ్ళను 10 సెకండ్లపాటు పైకెత్తండి.
3. పాదములను (మడమలను) 10 సెకండ్లపాటు నేలకు గట్టిగా ఆనించండి.
4. వెల్లికిలా పడుకొని రెండు పాదాలను జోడించి 10 సెకండ్లపాటు నేలనుండి ఒక అడుగు పైకెత్తిపెట్టి, లోపలికి మడవండి. మళ్ళీ యధాస్థితికి రండి.

**2. కడుపు**

1. కడుపులోకి బాగా గాలి పీల్చడం ద్వారా కడుపును ఉబ్బించాలి. ఆ గాలిని బయటకు వదలడం ద్వారా కడుపును 10 సెకండ్లు లోపలికి తీసుకోవాలి.
2. బాగా గాలిపీల్చి అలాగే ఊపిరి బిగించి అలాగే వుండి 10 సెకండ్ల తరువాత నెమ్మదిగా ఊపిరి బయటకు వదలాలి.

**3. ఊపిరితిత్తులు**

1. బాగా గాలిపీల్చి, వెంటనే బయటకు వదలాలి. ఇలా 10 సెకండ్లు చేసి తరువాత నెమ్మదిగా గాలిని పీల్చి, నెమ్మదిగానే బయటకు వదలాలి. గాఢంగా గాలిపీల్చిన తరువాత, అలాగే ఉండి 1 నుండి 10 దాకా సంఖ్యలు లెక్కపెట్టిన తరువాత నెమ్మదిగా గాలిని బయటకు వదలాలి. (10 సెకండ్లు)

**4. వెన్నెముక**

1. వెల్లకిలా పడుకుని వెన్నుముక కుడివైపుకు త్రిప్పాలి. మళ్లీ 10 సెకండ్లు ఎడమవైపుకు త్రిప్పాలి.

**5. చేతులు, భుజాలు**

1. విశ్రాంతిగా, రెండు చేతులను చాచుకొని పడుకోండి.
2. కుడిచేతి పిడికిలి బిగించండి. 5 సెకండ్లపాటు అలాగే ఉండి, పిడికిలి తెరవండి.
3. ఎడమచేతి పిడికిలి బిగించి అలాగే 5 సెకండ్లపాటు ఉంచి తరువాత నెమ్మదిగా పిడికిలి తెరవండి.
4. ఐదు వ్రేళ్ళను వెడల్పుగా 5 సెకండ్లపాటు ఉంచాలి.
5. రెండు చేతులను నిటారుగా పైకెత్తి 5 సెకండ్లపాటు అలాగే ఉంచండి. తరువాత యథాస్థితికి రండి.
6. రెండు చేతులను వెడల్పుగా చాచి 5 సెకండ్లపాటు ఉంచి మళ్లీ మామూలుస్థితికి రావాలి.
7. కుడిచేత్తో ఎడమభుజాన్ని, ఎడమచేత్తో కుడిభుజాన్ని గట్టిగా పట్టి 5 సెకండ్లపాటు అలాగే ఉండి నెమ్మదిగా యథాస్థితికి రావాలి.

**6. మెడ, ముఖము**

1. ముఖాన్ని క్రిందకు వంచి, గడ్డాన్ని హృదయానికి తగిలించాలి. ఇలా 10 సెకండ్లపాటు ఉండి నెమ్మదిగా యథాస్థితికి రావాలి.
2. రెండు చేతుల వ్రేళ్ళను పెనవేసి, తలను వెనక్కి వుంచి, ఆ చేతులపై ఉంచాలి. 5 సెకండ్ల తరువాత యథాస్థితికి రావాలి. ఇలా రెండు సార్లు చేయాలి.
3. కనుగ్రుడ్లను వృత్తాకారంగా మూడు సెకండ్లపాటు తిప్పాలి.
4. ముఖంలోని కండరాలను బిగించి 5 సెకండ్లపాటు ఉంచి మళ్ళీ మామూలుస్థితికి రావాలి.
5. గట్టిగా అరవడానికి వీలుగా నోరు పూర్తిగా తెరవాలికాని, అరవకూడదు.
6. నుదుటిపై ముడుతలు పడేలా కనుబొమలను పైకెత్తి 1 నుండి 4 దాకా సంఖ్యలను ఎంచి మళ్ళీ మామూలు స్థితికి రావాలి. ఇలా రెండు, మూడుసార్లు చేయాలి. ఇలా చేసిననాడు వృద్ధత్వం బాధించదు.


**Statement about ownership and other particulars about Newspaper**
**"PRAMUKHANDRA" Chennai - 600 004.**
**FORM IV (See Rule 8)**

| | | | |
|---|---|---|---|
| 1. | Place of Publication | : | Chennai |
| 2. | Periodicity of its Publication | : | Monthly |
| 3. | Printer's Name | : | **G.V. RAO** |
| | Nationality | : | Indian |
| | Address | : | Printed at **Goteti Graphics** 64, Thambaiah Reddy Road, West Mambalam, Chennai - 600 033. |
| 4. | Publisher's Name | : | **G.V. RAO** |
| | Nationality | : | Indian |
| | Address | : | 64, Thambaiah Reddy Road, West Mambalam, Chennai - 600 033. |
| 5. | Editor's Name | : | **G.S. RAMARAO** |
| | Nationality | : | Indian |
| | Address | : | 64, Thambaiah Reddy Road, West Mambalam, Chennai - 600 033. |
| 6. | Name & Address of individuals who own the Newspaper and Partners | : | **GV RAO** 64, Thambaiah Reddy Road, West Mambalam, Chennai - 600 033. |

I, **G.V. RAO** hereby declare the particulars given above are true to the best of my knowledge and belief.

Date : 28-2-2014 **(Sd.,) GV RAO**
Chennai - 600 033. PUBLISHER








*Lovely Stay at Holy Tirupathi* *The Gateway of Lord Balaji*

**HOTEL MAYURA**

**204, 209, T.P. Area, Tirupati - 517 501 (A.P.)**
**(Opposite Bus Station)**
**Phone : 0877-2225925, 2225251, Fax : 0877-2225911**
**e-mail : mayurahotels.yahoo.co.in, Grams : "MAYURA"**